కథ

# స్ఫూర్తి

''ఏ మాటకు ఆమాటే చెప్పుకోవాలి మాధవమ్మా! నీ కోడలు రవళి మంచి గుణవంతురాలు, బుద్ధిమంతురాలు. గౌరవ మర్యాదలు తెలిసిన వ్యక్తి!'' అంది సుందరమ్మ.

''అవును వదినా! అంత పెద్ద చదువు చదివి ఆఫీసర్ ఉద్యోగం చేస్తున్నా పిసరంత కూడా డాబు, దర్పం, భేషజం, ఏ కోశానా కానరావు!'' వంత పలికింది అన్నపూర్ణమ్మ.

''మరేం! గొప్పింటి పిల్లకు దొడ్డ బుద్ధులే ఉంటాయి! ఏవీ లేని వాళ్ళకే ఎక్కడలేని విరగపాట్లు! ఆ కాంతమ్మ కోడలు విమలను చూడు! ఏం మిడిసిపాటు, అబ్బో! చేస్తున్నదేమో ఎనిమిది వందల జీతానికి కాన్వెంట్‌లో మేస్టరమ్మ ఉద్యోగం! ఆ మాత్రానికే ఎంత గోరోజనం!

మొన్నటికి మొన్న మా మనవడిని కాన్వెంట్‌లో వేద్దామని పిల్లాడిని తీసుకొని నా కొడుకూ కోడలూ వాళ్ళ స్కూలుకి వెళ్ళేరు. తొందరగా పనైపోతే మావారు ఆఫీసుకు వెళ్ళిపోవాలి కాస్త మీ ప్రిన్స్‌పల్‌గారికి చెప్పుమని మా కోడలు విమలను అడిగితే, ఇక్కడ రికమెండేషన్స్ చెల్లవందిట! ఆ మట్టున మావాడు అక్కడున్న ఆయా చేతిలో రూపాయి బిళ్ళ పడవేస్తే పని వెంటనే జరిగిపోయింది.''

''అవునా! మరి నిన్న మా పెద్దాడు చెలానా కట్టాలని బేంకికి వెళ్లేడుట. అక్కడ గొప్ప రద్దీగా ఉందిట. నీ కోడలు మా వాడిని గుర్తుపట్టి గుమస్తాకి చెప్పి పని చేయించిందట. మావాడు అడక్కపోయినా ఆమె సహాయం చేసిందని ఎంతో మెచ్చుకున్నాడు.''

మాధవమ్మ యిరుగు, పొరుగు వారు సుందరమ్మ, అన్నపూర్ణమ్మలు. ఎదురింటి ఆవిడ కాంతమ్మ. తన కోడలు గుణగణాలు మెచ్చుకున్నందుకు మాధవమ్మ గర్వపడలేదు. కాంతమ్మ కోడల్ని విమర్శించినందుకు మాత్రం కాస్త నొచ్చుకుంది. ఇచ్చకాలను ఆమె ప్రోత్సహించదు.

''మీ అన్నయ్యగారు కరివేపాకు పొడి చేసి పెట్టమని అడిగేరు. నాలుగు రెబ్బలు కోసుకుంటాను వదినా!'' అంది అన్నపూర్ణమ్మ.

''కావాల్సినంత కోసుకు వెళ్ళు దానికి అడగాలా!'' అంది మాధవమ్మ.

''చారులోకి రెండు రెబ్బలు నేనూ కోసుకుంటాను'' అని అన్నపూర్ణమ్మ వెంట వెళ్ళింది సుందరమ్మ.

మాధవమ్మ కొడుకు కోదండపాణీ, కోడలు రవళి ఇద్దరూ బేంక్ ఆఫీసర్స్‌గా జాబ్స్ చేస్తున్నారు. కోదండపాణి కాస్త నెమ్మదస్తుడు. రవళి గడసరి. చురుకైంది. తప్పుకు దొరకదు. ఏ పని చేసినా ఎదుటి వాళ్ళకది ఒప్పు పనిలా కనిపించే విధంగా ప్రదర్శించగల నేర్పరి. ఆమె చేసే ప్రతి చిన్నపనీ పదిమంది దృష్టినీ ఆకర్షించి అందరి మెప్పూ పొందగల యుక్తిపరురాలు.

మాధవమ్మకు నెలకు మూడువేలు పెన్షన్ వస్తుంది. కోడలు కాపురానికి వచ్చే వరకూ ఇంటి ఖర్చులు, పాలు, పనిమనిషి జీతం, గ్యాస్, వగైరాలు ఆ డబ్బులోంచి ఖర్చు చేసేది. కొడుకు జీతం అంతా తెచ్చి తల్లికిచ్చేవాడు. ఆ డబ్బులోంచి ఇంట్లోకి అవసరమైన సరుకులకు ఖర్చుపెట్టేది.

రవళి మనీ విషయంలో ఎంతో ఖచ్చితంగా వ్యవహరిస్తుంది. ప్రతి ఖర్చుకూ లెక్కలు వేసి అనవసర ఖర్చులు తగ్గించటంలో దిట్ట. ఆమె కాపురానికి వచ్చేక భర్త జీతం, తన జీతం లోంచి ఇంటికి నెలకి కావాల్సిన సరుకులు తెప్పించి మిగిలిన సొమ్ము బేంక్‌లో వేస్తోంది. మాధవమ్మ ఆమె పెన్షన్‌లోంచి మునుపటి వలె పాలు, పనిమనిషి జీతం, గేస్ వగైరాలకు డబ్బు ఖర్చు పెడుతున్నా ఆ విషయం రవళి పట్టించుకోలేదు.

కోదండపాణీ నెలరోజులు ట్రైనింగ్‌కి హైదరాబాద్ వెళ్ళేడు. ఆ సమయంలో మాధవమ్మకు బిపి డౌన్ అయి చికాకు చేసింది. రవళి అత్తగారిని నర్సింగ్‌హోమ్‌లో జాయిన్ చేసింది. అన్ని టెస్ట్‌లూ చేయించింది. తను నాలుగు రోజులు శెలవుపెట్టింది. రోజుకు పదిసార్లు ఆటోల్లో నర్సింగ్‌హోమ్‌కి ఇంటికీ హడావిడిగా తిరిగి వీధిలో వారందరి దృష్టి ఆకర్షించింది.

''ఆఫీసర్ జాబ్ చేస్తున్నా రవళికి పిసరంత గర్వం లేదు. పైగా అత్తగారంటే ఎంత అభిమానం, గౌరవం! మాధవమ్మ గొప్ప అదృష్టవంతురాలు'' అని పదిమందీ పొగిడేరు. ఆమె అత్తగారికి చేస్తున్న సేవలు కొనియాడేరు.

రవళి అత్తగారిని నర్సింగ్ హోమ్ నుంచి ఇంటికి తీసుకొని వచ్చి ఆమెకు అయిన ఖర్చులు-మందులు, డాక్టర్‌ఫీజు, టెస్ట్‌లు. నర్సింగ్ హోం బిల్లు. పాలు, పండ్లు, బ్రెడ్, ఆటోలు. నాలుగు రోజుల శెలవు మొత్తం రూ.3800 లెక్కరాసి అత్తగారికిచ్చింది.

మాధవమ్మగారు మాటాడక బీరువాలోంచి డబ్బు తీసి కోడలు ముందుంచింది. రవళి డబ్బుతీసి రెండు పర్యాయాలు లెక్కపెట్టి పర్స్‌లో వేసుకొని ఆఫీసుకు వెళ్ళిపోయింది.

అత్తగారి కొరకు ఏ ఖర్చు చేసినా లెక్కరాసి ఆవిడకు యిచ్చి డబ్బు తీసుకోవడం రవళికి పరిపాటే.

కోదండపాణికి ప్రమోషన్ వచ్చింది. ఆఫీసువారు బంగ్లా ఎలాట్ చేసేరు. అది కూడా వాళ్ళ యింటికి దగ్గరలోనే వుంది. ఆఫీసు కారు డ్రైవర్ ఎలాట్ చేసేరు. అయితే రవళికి అత్తగారిని తమతో తీసుకొని వెళ్ళడం ఇష్టం లేదు.

''మామగారు కట్టించిన యిల్లు వదిలి ఆవిడ మాతో రానన్నా''రని రవళి ముందుగానే అందరికీ ఎంతో నేర్పుగా ప్రచారం చేసింది. ఆమె మాటలు నమ్మిన ఇరుగు పొరుగు వారు బంధువులూ మాధవమ్మ మూర్ఖత్వానికి ఆమెను తప్పు పట్టేరు.

''ఈ వయస్సులో ఆవిడకు యింకా సెంటిమెంట్స్ ఏమిటీ? హాయిగా కొడుకూ, కోడలు వద్దకు వెళ్ళి వుండక'' అన్నారు.

నేర్పుగా ముందర కాళ్ళకు బంధం వేసిన కోడలి తెలివికి విస్తుపోయింది మాధవమ్మ. కొడుకు మాట వరసకి కూడా తమతో రమ్మని పిలవనందుకు ఎంతో నొచ్చుకుంది.


భర్తను ఏవిధంగా అదుపులో వుంచాలో రవళికి తెలుసు. కోడలు సీమంతానికి, మనవడి నామకరణానికి వెళ్ళి ఒక పూట వుండి వచ్చేసింది మాధవమ్మ. ఆమెను మరొక పూట ఉండమనలేదు ఎవరూ.

రవళికిప్పుడు కొత్త ప్రోబ్లమ్ వచ్చింది. ఆమెకున్న మెటర్నిటీ లీవ్ అయిపోయింది. ఇక డ్యూటీలో జాయిన్ అవ్వాలి. లేకుంటే లాస్ ఆఫ్ పే. ఉన్న లీవ్‌లు అన్నీ ముందుగానే వాడేసింది. డెలివరీకి వచ్చి ఇంతవరకూ తోడుగా వుండిన ఆమె తల్లి వెళ్ళిపోయింది. పసివాడిని ఆయాల చేతుల్లో పెడితే బోలెడు ఖర్చని భయం. పరిష్కార మార్గం ఆలోచిస్తున్న సమయంలో ఆమె చిన్ననాటి స్నేహితురాలు రేవతి కలిసింది. ఇద్దరూ కాస్సేపు చిన్ననాటి విషయాలన్నీ ముచ్చటించుకున్నారు.

''నేనూ, మావారూ ఇద్దరం జాబ్ చేస్తున్నాం రవళీ! మాకు నాలుగు నెలల బాబున్నాడు. చెప్పుకోదగ్గ దగ్గర బంధువులు మాకు లేరు. నెల క్రితం ట్రాన్స్‌ఫర్ మీద ఈ వూరొచ్చేం. మాకు దేవాలయం లాంటి యిల్లు దొరికింది. ఇంటి ఓనర్ మాధవమ్మగారు దేవతే! ఆవిడ నన్ను కన్న కూతురులా చూసుకుంటున్నారు. మావాడి ఆలనా పాలనా ఆవిడే చూస్తున్నారు. మాకు ఏ దిగులూ లేదు. నిశ్చింతగా ఆఫీసుకు వెళ్ళి వస్తున్నాం. ఆవిడ ఎంత అభిమానవంతురాలో తెలుసా! పిల్లాడికి పట్టడానికి పాలు కూడా ఆవిడే తెప్పిస్తారు. ఫేరెక్స్ కొన్నారు. నేను ఏమిచ్చినా తీసుకోరు. పిల్లాడు తాగే ఉగ్గు గిన్నెడు. పాలు నువ్వు నాకివ్వాలా అంటారు. మావాడికి ఆవిడ దగ్గర ఎంత చేరికనుకున్నావ్! ఆవిడ పలకరిస్తే చాలు కేరింతలు కొడతాడు. మాకు ఆవిడ చేస్తున్న హెల్ప్ ఎన్ని జన్మలెత్తినా తీరదు'' అంది రేవతి.

స్నేహితురాలి మాటలకు నివ్వెర పోయింది రవళి. అయితే మాధవమ్మ తన అత్తగారేనన్న విషయం రేవతికి చెప్పలేకపోయింది.

రవళికి చక్కటి పరిష్కార మార్గం గోచరించింది.



ఆ సాయంత్రం భర్తనూ కొడుకునూ తీసుకొని అత్తగారిని చూడ వెళ్ళింది.

మాధవమ్మ కొడుకూ, కోడలూ పసివాడిని తీసుకొని అలా సడన్‌గా రావడంతో విస్తుపోయింది. వారిని సాదరంగా ఆహ్వానించి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకుంది.

రవళి కొడుకుని అత్తగారి ఒడిలో వుంచింది.

మాధవమ్మ మనవడిని ముద్దాడింది.

రవళి అత్తగారితో కాస్సేపు ముచ్చటించి అసలు విషయం చెప్పింది.

"అత్తయ్యా! నాకు లీవ్ అయిపోయింది. రేపే డ్యూటీలో జాయిన్ అవ్వాలి. లేకుంటే జీతం నష్టం! మా అమ్మగారు నిన్ననే వెళ్ళిపోయేరు. అందుచేత మేము ఆఫీసుకు వెళ్ళేటప్పుడు మీ మనవడ్ని మీ వద్ద వదిలి సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చి వాడిని మా వెంట యింటికి తీసుకొని వెళతాం. మరి మీ మనవడి ఆలనా పాలనా మీరే చూడాలి!" అంది ఎంతో వినయంగా.

కోడలు మాటలకు చిరునవ్వు నవ్వింది మాధవమ్మ. కొడుకు వైపు చూసింది.

"అవునమ్మా రవళీ..." ఏమో చెప్పబోయేడు కోదండపాణి.

"దాందేం వుందిరా! నేను ఖాళీగానే వున్నాను కదా!" అంది. కనీసం యీ సమయంలోనైనా కొడుకూ కోడలూ తనను వారి దగ్గరకు వచ్చి ఉండమంటారనుకుంది.

"మీరు ఖాళీగా వున్నారు కనుకనే మేము ఆఫీసుకు వెళ్తా మీ మనవడిని మీ వద్ద వదిలి వెళ్తే మీరు సాయంత్రం వరకూ వాడి ఆలనా, పాలనా జాగ్రత్తగా చూస్తారని"

"అలాగా!" అని కాగితం పెన్నూ తెచ్చి ఉదయం ఎన్ని గంటల నుండీ సాయంత్రం ఎన్ని గంటల వరకూ మీ అబ్బాయి ఆలనా పాలనా నేను చూడాలి! అంది మాధవమ్మ కేజువల్‌గా.

"ఉదయం పది గంటల నుండీ సాయంత్రం ఆరు వరకూ"

"అంటే ఎనిమిది గంటలు!"

"అవునండీ! మేం అందరి వలె రంచన్‌గా ఐదుగంటలకే ఆఫీసు వదిలి రావడానికి అవదు. మావి ఆఫీసర్ జాబ్స్ కదా!" అంది రవళి గర్వంగా.

మాధవమ్మ ఏవో లెక్కలు వేసి

"చూడు రవళీ! ప్రతీ పని విలువనూ రూపాయల్లో లెక్కించి నీలా కరెక్ట్‌గా చూపలేను కాని ఏదో నీ స్ఫూర్తితో ఆ విద్య కొద్దిగా నాకూ అలవడింది. రోజుకు ఎనిమిది గంటలు నీ కొడుకు ఆలనా పాలనా చూడాలి! అందుకు నా సర్వీసు ఛార్జీలు గంటకు పదిరూపాయలు మాత్రమే! ముందుగా రెండువేలు అడ్వాన్స్ యివ్వాలి. ఇష్టమైతే చెప్పు!" అన్న అత్తగారి మాటలు తూటాల్లా తగిలేయి రవళికి.

★

రావి. ఎన్. అవధాని